
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 78 | మంగళవారం 16 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# భారత్‌కు ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఏపీ



### రెండో నివాసంగా అమరావతిని ఎంచుకోండి
### సింగపూర్ పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు

**(అంకుశం, అమరావతి, జూన్ 16):**
భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఏపీదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సీఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. - మిగతా2లో



## పవన్ కళ్యాణ్.. ఏమి మాట్లాడుతున్నావ్



### ఆయన వ్యాఖ్యల పట్ల ఆత్మ విమర్శ చేసుకోవాలి
### కేంద్రాన్ని మేము ప్రశ్నిస్తాం- డిప్యూటీ సీఎం పవన్
### వ్యాఖ్యలను ఖండించిన సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

**(అంకుశం, అమరావతి, జూన్ 16):**
ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఢిల్లీలో దక్షిణాది నేతలను ఉద్దేశించి చేసిన దుందుడుకు వ్యాఖ్యలను సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లి తన పార్టీ నాయకులందరితో సమావేశం పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ కు అధికారం ఉంది. డబ్బులున్నాయి. ఇక్కడ నాయకులను ఢిల్లీ తీసుకువెళ్లి అక్కడ సమావేశం పెట్టుకోవడం ఆయన ఇష్టం. తప్పేం కాదు. కానీ పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లి మాట్లాడుతూ "దక్షిణ భారతదేశ నాయకులు ఢిల్లీ వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తాం మెడలు వంచుతాం అని మాట్లాడతారేగాని, ఢిల్లీకి వచ్చిన తర్వాత ఏమి మాట్లాడలేక పోతున్నారని, ఢిల్లీ పెద్దల ముందు సాగిల పడుతున్నారని చెబుతు న్నారు. ఢిల్లీ పెద్దల - మిగతా2లో

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 90వ రోజు ప్రజాదర్బార్

### వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతుల స్వీకరణ
### అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి హామీ



**అంకుశం ప్రతినిధి అమరావతి జూన్ 16**
మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 90వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పల్నాడు జిల్లాకు అత్యంత ముఖ్యమైన వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వరికపూడిశెల జలసాధన సమితి ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. బుద్ధ యోగా ఫౌండేషన్ ద్వారా మోసపోయిన 1056 మంది యోగా ఇన్ స్ట్రక్టర్స్ కు తగిన న్యాయం చేయాలని బాధితులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. గత మూడేళ్లుగా తాము చేసిన సేవలను గుర్తించి - మిగతా2లో

## హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు



- రేవంత్ రెడ్డి అలా మాట్లాడటం సమంజసం కాదు
- రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని వెల్లడి
- కేంద్రానికి రేవంత్, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా

**హైదరాబాద్**
గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దేశవ్యాప్తంగా మిగతా మెట్రోల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర సహకారం ఉంటుందని తెలిపారు. సాంకేతిక, ఆర్థిక విషయాలు చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే సాకారమవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విమర్శల నేపథ్యంలో ఢిల్లీలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ కావున, కిషన్ రెడ్డి వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని, అనాలోచితంగా, దుందుడుకుగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని హితవు కిషన్ రెడ్డి పలికారు. తెలంగాణ అభివృద్ధి పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని స్పష్టం చేశారు. మోదీకి, తనకు, కేంద్రానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదని ఎద్దేవా చేశారు. తామ రేవంత్ రెడ్డికి జవాబుదారీ కాదని, తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా - మిగతా3లో



## జవాబుదారీతనం అనే పరీక్షలో బీజేపీ ఫెయిల్

- ప్రధాన్ కచ్చితంగా రాజీనామా చేయాల్సిందే: ఖర్గే
- టెలిగ్రామ్‌ను బ్లాక్ చేయడం కాదు
- కోట్లాది మంది యువత భవిష్యత్తును బ్లాక్ చేసిన మంత్రిని తొలగించండి
- మోదీ ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు

## తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే

- ఈ జిల్లాల్లో ఒక శాతమూ అడవుల్లేవ్?!
- రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో అసమానతలు
- 0.15 శాతం అడవులను కలిగి ఉన్న కరీంనగర్
- హైదరాబాద్‌లో అటవీ సంపద ఆందోళన కలిగించడానికి కారణమేంటంటే?



**హైదరాబాద్**
అడవులతోనే మానవాళికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నో జబ్బులకు ఔషధాలను అటవీ సంపద అందిస్తుంది. అంతేనా? పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందిస్తుంది. వన్యప్రాణులకైతే అడవే ఆధారం. అలాంటిది రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో భారీగా అసమానతలు కనిపిస్తున్నాయి. ములుగు జిల్లా అడుగడుగునా పచ్చదనంతో కళకళలాడుతోంది. కొత్తగూడెంలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ప్రస్తుతం ఈ రెండు జిల్లాలే 'తెలంగాణకు ఊపిరితిత్తులు' గా మారాయి. కానీ గద్వాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి జిల్లాల్లో మాత్రం పచ్చదనం కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. రాష్ట్రం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 24.05 ఉందని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన తాజా నివేదికలో తెలిపింది. భూభాగం అటవీ ప్రాంతంలో 71.82 శాతం విస్తీర్ణంలో ములుగు జిల్లా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60.95 శాతం అడవులు ఉన్నాయి. నది పరీవాహక ప్రాంతంలో, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్ కర్నూల్ - మిగతా3లో

అంకుశం
సాయంకాలం దినపత్రిక
మంగళవారం 16 జూన్ 2026

# హైదరాబాద్ మెట్రోపై మాకు వివక్ష లేదు

-మొదటిపేజీ తరువాయి

పని చేశామని, ఇప్పుడూ పని చేస్తామని, తెలంగాణకు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశానని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దిల్లీకు వచ్చి రెండుసార్లు ధర్నా చేశామని గుర్తు చేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించానని గుర్తు చేశారు.



### ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించాం

తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్న కేంద్రమంత్రి హితువు పలికారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితే రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టలేదని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టిందని పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 కోసం కేసీఆర్ సహకరించకలేదని ఆరోపించారు. కేసీఆర్ సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ఫేజ్-2 ప్రారంభించామన్నారు. తెలంగాణకు రాదనుకున్న రైల్వే ఫ్యాక్టరీని సాధించామని, ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించింది : మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలేనని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 50 ఏళ్లు వడ్డీ లేకుండా ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం ఇచ్చిందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్‌వోసీ ఇచ్చిందని, ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశామని, ధాన్యం కొనుగోళ్లకు రూ.37 వేల కోట్లను ఎన్‌సీడీసీ ద్వారా మంజూరు అయ్యాయని, ఇప్పటికే రూ.34 వేల కోట్లు ఎన్‌సీడీసీ తెలంగాణకు అందించిందని వెల్లడించారు.


### ప్రాజెక్టులకు సహకరిస్తాం

ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందని, ప్రాజెక్టులు ఆపే సంస్కృతి బీజేపీకి లేదని అది కాంగ్రెస్‌కే ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. డొంకదారిన ప్రాజెక్టులు అడ్డుకోవాల్సిన కర్మ తమకు లేదని, రేవంత్ రెడ్డి కోసమో, మరెవరి కోసమో ప్రాజెక్టులు అడ్డుకోమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రాజెక్టులకు సహకరిస్తామని స్పష్టం చేశారు.

"మెట్రో ఫేజ్ 2 మరింత వేగవంతానికి నేను సీఎంకు లేఖలు రాశా. ఐఆర్‌ఎఫ్‌సీతో ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. రుణ ఒప్పందం విషయమై అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. మెట్రో-1 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రుణం తీసుకుంటోంది. రుణం విషయమై రాష్ట్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. టికెట్లు, యాడ్ ఆదాయాన్ని ముందుగా అప్పు చెల్లించాలని ఒప్పందం జరిగింది. ఈ విషయమై కేంద్ర సూచనలకు సీఎం అంగీకరించట్లేదని చెప్పారు. అన్ని మెట్రోలు తీసుకున్న రుణాలు వాటికే ముందుగా చెల్లించరు. రెగ్యులర్ మెట్రో ఆపరేషన్, నిర్వహణకు ముందుగా వచ్చిన ఆదాయం చెల్లించాలి. ఆ తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించాలి" - కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

# తెలంగాణలో విచారణల పాలిటిక్స్

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం? ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు.. సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు.కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.



# సింగూరు డ్యామ్‌కు డేంజర్ బెల్స్

**మెదక్ :** ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి.అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది.ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పటికీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగగుతారు.మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్‌ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు.పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.



## భారత్‌కు ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలున్నాయి. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామిక వేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండో నివాసంగా ఎంచుకోవాలి.' అని అన్నారు. 'ఏపీలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నాం. వికసిత్ భారత్ 2047 స్వర్ణాంధ్ర 2047 విజన్ కు కు రూపకల్పన చేశాం. త్వరలోనే భారత ఎకనామిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతిని నిర్మించటం తోపాటు ఈవీల వినియోగం, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతిలోనే ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 90వ రోజు ప్రజాదర్బార్

-మొదటిపేజీ తరువాయి

తగిన న్యాయం చేయడంతో పాటు భవిష్యత్ లో కూడా ఈ సేవలు ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగించేలా చొరవ చూపాలని అభ్యర్థించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో జరిగిన గోల్డ్ లోన్ అవతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. తాము కుదవ పెట్టిన బంగారం వస్తువుతో పాటు తూకంలో తేడాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పేద గర్భిణీల ఆరోగ్య సంరక్షణకు నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టడంతో పాటు మహిళల ఆత్మరక్షణకు ప్రతి నియోజకవర్గంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం పంచాయతీ సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన ఎన్.మల్లికార్జున నాయుడు కోరారు. గ్రామంలో రోడ్ల నిర్మాణంతో పాటు గండివాగుపై బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## పవన్ కళ్యాణ్.. ఏమి మాట్లాడుతున్నావ్

-మొదటిపేజీ తరువాయి

ముందు సాగిల పడేవారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాఖ్యలు పవన్ కళ్యాణ్ తన గురించి తానే చెప్పుకున్నట్లుగా గోచరిస్తున్నది. గతంలో పవన్ కళ్యాణ్ ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఆనాడు పోరాడేటప్పుడు సిపిఐ తో పాటు ఆయన కూడా కేంద్రాన్ని నిలదీశారు. కేంద్రం మెడలు వంచి, సాధిస్తామన్నారు. మోడీ, అమిత్ షా ల గురించి పవన్ కళ్యాణ్ ఇంగ్లీష్ తో పాటు హిందీలో కూడా మాట్లాడుతూ 'లడంగే... జీతేంగే...' అని ప్రగల్బాలు పలికారు. పాచిపోయిన లడ్డూలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. కానీ ఇప్పుడు అదే పవన్ కళ్యాణ్ మోడీ అమిత్ షా ల దగ్గరకు వెళ్లి వాళ్ళకు శాలువాలు కప్పి, వాళ్ళకి సాష్టాంగాలు పడి అందరూ అదే పని చేస్తారంటూ వ్యాఖ్యానించడం దుర్మార్గం. కమ్యూనిస్టులు ఎక్కడైనా ఎదిరిస్తారని, నిలదీస్తారనే విషయాన్ని పవన్ కళ్యాణ్ గ్రహించకపోవడం ఆయన అవివేకానికి నిదర్శనం. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏపీకి అన్ని విధాలుగా అన్యాయం చేసింది. తెలంగాణకు అన్యాయం చేసింది. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేందుకు కోనుకున్నారు కాబట్టే సిపిఐ గా మేము కచ్చితంగా కేంద్రాన్ని నిలదీస్తాం. పవన్ కళ్యాణ్ లాగా పూటకో మాట మాట్లాడడం కమ్యూనిస్టులకు చేతకాదు. పవన్ కళ్యాణ్ తాను చేసే పనులను ఇతరులపై రుద్దాలనే మనస్తత్వాన్ని ఇకనైనా మానుకోవాలని హితవు పలుకుతున్నాం. పవన్ కళ్యాణ్ కు చేతనైతే కేంద్రంపై పోరాడి సాధించాలి. అంతేగాని పోరాడే వారిని కించపరుస్తూ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరైనది కాదు. గతంలో సమైక్యత వాదిని చెప్పుకు నే పవన్ కళ్యాణ్ తెలంగాణ వారి దిష్టి తగిలిందని చెప్పారు. మళ్లీ వెళ్లి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తానని చెబుతున్నారు. స్థిరత్వం లేని వ్యాఖ్యలతో పవన్ కళ్యాణ్ మనస్తత్వం సాగుతోందన టానికి ఇవే నిదర్శనాలు. గతంలో కేంద్రంతో పోరాడిన పవన్ కళ్యాణ్ తానే లొంగిపోయి కేంద్రానికి సాగిలపడినట్లుగా, అందరూ సరెండర్ అవుతారని చెప్పటం అవివేకం. కమ్యూనిస్టులు ఏనాడు ఎవరికి లొంగే ప్రసక్తే లేదని నొక్కి చెబుతున్నాం. ప్రజల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారాల కోసం కచ్చితంగా కేంద్రాన్ని నిలదీస్తామని, నరేంద్ర మోడీ అనాలోచితి విధానాలను ఎండగడతామని నొక్కి వక్కాణిస్తున్నాం అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ పేర్కొన్నారు.

## 21న విజయవాడలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

-- యోగా దినోత్సవానికి సీఎం చంద్రబాబు, యోగా గురువు బాబా రాందేవ్ హాజరు

-- ఏర్పాట్లను పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



**(అంకుశం, విజయవాడ, జూన్ 16):** విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ బాబాలు హాజరు కానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డా.

# సమాచార హక్కు చట్టం సక్రమంగా అమలు చేయాలి

**– : డిఆర్ఓ ఏ.మలోల**




**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 16 :** జిల్లాలో సమాచార హక్కు చట్టం సక్రమంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ఏ.మలోల పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సమాచార హక్కు చట్టంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది. జిల్లా సమన్వయ అధికారిగా జిల్లా కలెక్టర్, సభ్యులుగా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి, సభ్యులుగా జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, డీఈవో, సమాచార హక్కు చైతన్య వేదిక రాయల కొండయ్య, సమాచార హక్కు ఐక్యవేదిక ప్రెసిడెంట్ లాల్య నాయక్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయడం జరగగా, జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

– ఈ సందర్భంగా డిఆర్ఓ మరియు నోడల్ అధికారి ఏ.మలోల మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలుకు అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. ఈ చట్టం ఎంతో ముఖ్యమైనదని, అన్ని కార్యాలయాల ఎదుట సమాచార హక్కు చట్టంపై బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమాచార శాఖ హక్కు చట్టం కింద దరఖాస్తు చేసేందుకు దరఖాస్తుదారులు వచ్చినప్పుడు వారికి సీటు ఇవ్వడం, వారిని మంచిగా రిసీవ్ చేసుకోవడం చేయాలని, ఎవరైనా చట్టం ప్రకారమే ప్రవర్తించాలన్నారు. అప్పిలేట్ అధికారి, అసిస్టెంట్ అప్పిలేట్ అధికారి ఇవ్వాల్సిన సమాచారం సరిగ్గా ఇవ్వాలని, చిన్నచిన్న నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సమాచార హక్కు చట్టంపై ఆయా శాఖల హెచ్ఓడీలు ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, సమాచారాన్ని ఇవ్వగలిగినది ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అన్ని కార్యాలయాల్లోనూ సచివాలయాల్లోనూ బోర్డులను ఏర్పాటు చేయడం త్వరలోనే అమలు చేయాలన్నారు.

– ఈ సందర్భంగా సభ్యులు రాయల కొండయ్య, లాల్య నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్లోనూ సమాచార హక్కు చట్టం కింద బోర్డు లేదని, బోర్డులను ఏర్పాటు చేయాలని, సచివాలయంలో కూడా బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. తమ పరిధిలో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

– ఈ సమావేశంలో సమాచార హక్కు చైతన్య వేదిక దేసు కొండయ్య (రాయల కొండయ్య), సమాచార హక్కు ఐక్యవేదిక ప్రెసిడెంట్ లాల్య నాయక్, డిపిఓ నాగరాజునాయుడు, జెడ్పి సీఈవో విజయలక్ష్మి, డిఇఓ కార్యాలయం ఏఓ మునీర్ భాష, బీసీ సంక్షేమ శాఖ డిడి ఖుష్బూకొఠారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఎండోమెంట్ ఏసి మల్లికార్జున ప్రసాద్, చేనేత జౌళి శాఖ ఏడి వరప్రసాద్, అభివృద్ధి అధికారి బసవరాజు, జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ వసంతలత, ఆర్టీవో సురేష్ నాయుడు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యోగాని ప్రతిఒక్కరూ నిత్యజీవితంలో భాగం కావాలి







**– : యోగాంధ్రలో దివ్యాంగ థీమ్ తో అవగాహన కార్యక్రమాలు..**

**– : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**– : అనంతపురం నగరంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో 'దివ్యాంగ' థీమ్ తో ప్రత్యేక దివ్యాంగ యోగాసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహణ**

**– : పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, ఏపీ వికలాంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, తదితరులు..**

**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 16 :** యోగాంధ్ర – 2026 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం అనంతపురం నగరంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో 'దివ్యాంగ' థీమ్ తో ప్రత్యేక దివ్యాంగ యోగాసన ప్రదర్శన కార్యక్రమం స్ఫూర్తి నింపేలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఏపీ వికలాంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా యోగాసనాలు వేసి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, డిఆర్ఓ, తదితరులు పలువురిలో స్ఫూర్తి నింపారు. జిల్లా కలెక్టర్, జెసితో పాటు ప్రతి ఒక్కరూ ఉత్సాహంతో యోగాసనాలు వేశారు. యోగా మాస్టర్లు రాజశేఖర్ రెడ్డి, మమతా, కృష్ణవేణి, రవి, మారుతి ప్రసాద్ లు అందరి చేత యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో 2 వేల మందికి పైగా దివ్యాంగులు, విద్యార్థులు, అధికారులు, అనధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా అనంతపురం జిల్లాలో ఒక మెగా కార్యక్రమం చేయడం జరిగిందని, నగరంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో యోగాంధ్రలో భాగంగా 'దివ్యాంగ' థీమ్ తో ప్రత్యేక దివ్యాంగ యోగాసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గత సంవత్సరం యోగాంధ్ర కార్యక్రమాలు బాగా చేశామని, ఈ ఏడాది కూడా యోగాంధ్రలో భాగంగా గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు యోగాపై వివిధ రకాల పోటీలను పెట్టుకోవడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో నుంచి ముందుకు వచ్చిన వారిని మండల స్థాయిలో, ఆ తర్వాత జిల్లా స్థాయిలో పోటీలను చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయి పోటీలకు కూడా జిల్లా నుంచి విద్యార్థులను పంపించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులతో సమన్వయం చేసుకుని యోగా నిర్వహించడం జరిగిందని, ఇంకా రాబోయే 21వ తేదీ లోపల జిల్లాలో గుత్తి కోటలో, అదేవిధంగా తాడిపత్రి టెంపుల్స్ లో కూడా యోగాంధ్ర కార్యక్రమాలు చేయడం జరుగుతాయన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరూ కూడా దయచేసి ఈ యోగాని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని, ఈ నెలలో, ప్రతి సంవత్సరం కూడా ఈ యొక్క థీమ్ తో అవేర్నెస్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు కూడా వారి ఇంట్లో ఆ దయచేసి ఈ యొక్క కార్యక్రమం చేయాలని కోరుతున్నామన్నారు. యోగా చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నెల రోజుల పాటు సాగే ఈ యోగాంధ్ర యాక్టివిటీ ద్వారా ప్రజల్లో అవగాహనను గరిష్టంగా పెంచడం చేస్తున్నామన్నారు. ప్రజలు స్వయంగా యోగా ప్రోటోకాల్‌ను నేర్చుకుంటే సరిపోతుందని, సొంత ఇల్లైనా, అద్దె ఇల్లైనా సరే... ఇంట్లో ఒక చిన్న స్థలం ఉన్నా కూడా దీనిని ఖచ్చితంగా పాటించడానికి వీలుంటుందన్నారు. యోగా నిత్యం చేయడం వల్ల రకరకాల ఆరోగ్య ప్రయోజనాలు కలగడమే కాకుండా, భవిష్యత్తులో ఆరోగ్యానికి అయ్యే ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరూ కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి దగ్గరకు యోగాను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా యోగా డే సంకల్పాన్ని యోగా మాస్టర్ రాజశేఖర్ రెడ్డి అంధ్ర చేత ప్రతిజ్ఞ చేయించారు.

– ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ మంజుల, బిసి సంక్షేమ శాఖ డిడి ఖుష్బూ కొఠారి, ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, యోగాంధ్ర కాంపిటీషన్స్ ఆయుష్ డిపార్ట్మెంట్ ఇన్చార్జి డా.రామకుమార్, యోగాంధ్ర జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ లాల్య నాయక్, డిఆర్డీఏ పిడి శైలజ, డిపిఓ నాగరాజునాయుడు, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, జిల్లా పర్యాటక అధికారి ఓబులమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, అనధికారులు, వికలాంగుల అసోసియేషన్, వందలాది మంది దివ్యాంగులు, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# దేశం పార్టీతోనే బీసీలకు న్యాయం

**– అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలబడింది.. టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు**






**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 16:** అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా బలిగొని నేటికి మూడు సంవత్సరాలు పూర్తయ్యాయని, బీసీలపై వైసీపీకి ఉన్న కక్ష ఈ ఘటనతో స్పష్టంగా బయటపడిందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా అనంతపురం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గం చెరుకూరు గ్రామంలో తన అక్కను వేధింపులకు గురిచేస్తున్న వారిని ప్రశ్నించినందుకే 15 ఏళ్ల అమాయక బాలుడు అమర్నాథ్ గౌడ్‌పై వైసీపీ నాయకులు పెట్రోల్ పోసి సజీవదహనం చేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి దారుణ ఘటనలో నిందితులను కాపాడేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని విమర్శించారు. కానీ అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచి న్యాయం కోసం పోరాడింది తెలుగుదేశం పార్టీనేనని గుర్తు చేశారు. బలహీన వర్గాలపై జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని పూల నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ నాయకులు మేకల వేణుగోపాల్ గౌడ్, శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ సరిపుటి వెంకట రమణ, డైరెక్టర్లు నరసింహులు, బొమ్మినేని శివ, పరమేశ్వర్, కొండన్న, నాయకులు మణి రవి, అగ్రహారం రామకృష్ణ, శ్రీరాములు, తుమ్మల నారాయణస్వామి, ప్రసాద్, పరకాల కృష్ణమూర్తి, వెంకటేష్, శ్రీనివాసులు, మాజీ డైరెక్టర్ నారాయణస్వామి, ఈశ్వరయ్య, ధనుంజయ, అశోక్, పరకాల వెంకటేష్, మురళి, శ్రీశైలం రవి, భాస్కర్, దలవాయి వెంకటనారాయణ, చెరుకు తోట పవన్, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యం ప్రతిరోజు చేయాలి

**– రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు**

**– తిరుమల దేవర ఆలయం వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం**





**అంకుశం న్యూ అనంతపురం జూన్ 16 :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం ద్వారా వారి జీవితాల్లో మార్పు వస్తుందని రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత అన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రామగిరి మండలం నసనకోట సమీపంలోని శ్రీ తిరుమల దేవర వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం ఆవరణలో యోగా – 2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతతో పాటు స్థానిక టిడిపి నాయకులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరితో పాటు ఎమ్మెల్యే సునీత కూడా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితం రోజురోజుకీ యాంత్రికమవుతోందని.. ఇలాంటి సమయంలో శరీరం, మనసు ఒత్తిడికి గురవుతోందన్నారు. అందుకే ప్రతిరోజు యోగా చేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దీనిని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. సమయం లేదని నిర్లక్ష్యం చేయడం వల్ల అనారోగ్యాలు దరిచేరుతాయని.. ప్రతి ఒక్కరు యోగాను అలవాటుగా చేసుకోవాలని అన్నారు. యోగా చేయడం వల్ల శరీరమే కాకుండా మనసు కూడా ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

## కూటమి నాయకులతో కలిసి జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే బి కందికుంట



**అంకుశం న్యూస్,శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి,జూన్:16:** :కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పాలనపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కూటమి నాయకులతో కలిసి పాల్గొన్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్. ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే తో పాటు కదిరి నియోజకవర్గం టిడిపి కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కెనరా బ్యాంక్ ఏటీఎం మూసివేత...ఇబ్బందుల్లో వినియోగదారులు



**రాప్తాడు, అంకుశం న్యూస్ జూన్ 16:** మండల కేంద్రంలోని ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంకు ఏటీఎం గత కొన్నేళ్లుగా మూతపడి ఉండటంతో ఖాతాదారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వరంగ బ్యాంక్ ఏటీఎం సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఒక వినియోగదారునికి అత్యవసరంగా రూ. 40,000 నగదు అవసరమైతే, స్థానిక ఏటీఎంలలో నగదు పరిమితులు మరియు సాంకేతిక ఇబ్బందుల వల్ల సుదూరంలోని జెఎన్టియు సమీపంలో ఉన్న ఏటీఎంలకు వెళ్లాల్సి వస్తోంది. రాప్తాడులో అందుబాటులో ఉన్న ఇతర ప్రైవేట్ ఏటీఎంలలో (ఇండీక్యాష్, హిటాచి) ఒక లావాదేవీకి కేవలం రూ. 4,000 మాత్రమే వస్తుండటంతో, ఖాతాదారులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. మూడుసార్లు విత్ డ్రా చేసినా కేవలం రూ. 12,000 మాత్రమే వస్తున్నాయి. అదేవిధంగా, ఐదుసార్లు డ్రా చేస్తే బ్యాంక్ నిబంధనల ప్రకారం ఖాతాదారునికి అదనపు ఛార్జీలు పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత బ్యాంక్ అధికారులు స్పందించి, మూతపడిన ఏటీఎంను తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాప్తాడు మండల ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులపై కఠిన తనిఖీలు చేపట్టాలి-ఎఐ.ఎస్.ఎఫ్



**అంకుశం న్యూస్,శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి,జూన్:16** :కదిరి ప్రాంతీయ రవాణా అధికారి కి వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర.కదిరి నియోజకవర్గంలో నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల బస్సుల భద్రతా ప్రమాణాలపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర డిమాండ్ చేశారు.

## షాది మహల్ కి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన హిందూపురం ఎంపీ



**అంకుశం న్యూస్,శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ, జూన్: 16:** పెనుకొండ నియోజకవర్గం రొద్దంలో షాదీ మహల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి ని కోరిన మైనార్టీ సోదరులు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తప్పకుండా నిధులు కేటాయించి షాది మహల్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ సభ్యులు అనంతరం కృతజ్ఞతలు తెలియజేసిన మైనారిటీ సోదరులు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

## - విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్

**అంకుశం న్యూస్ ఉరవకొండ జూన్ 15 :** ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంతో పాటు వెలుపల విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. ఉరవకొండ మండలం పరిధిలోని వెలగొండ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన గేటు విరిగి పడి గాయపడిన విద్యార్థికి న్యాయం చేయాలని మరియు ఉరవకొండ మండలంలోని అన్ని పాఠశాలలో తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి,ఏఐఎస్టిఎస్ జిల్లా అధ్యక్షులు నందు,వైయస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు సాకే పురుషోత్తం మాట్లాడుతూ...వెలగొండ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన గేటు విరిగి పడటంతో ఒక విద్యార్థి తలకు బలమైన గాయాలు తగిలి 8 కుట్లు పడిన ఘటన అత్యంత బాధాకరమైనదన్నారు. ఈ సంఘటన ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల నిర్వహణలో ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని వాపోయారు. పాఠశాలలకు వచ్చే చిన్నారుల ప్రాణ భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు



తీసుకోవాలని, గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వం తరఫున తగిన ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలు, ప్రధాన గేట్లు మరియు ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్టిఎస్ నాయకులు తరుణ్, భాస్కర్, నరసింహ ,వైయస్సార్ విద్యార్థి విభాగం నాయకులు నాగరాజు, పవన్, దేవా, రవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం హాకీ టోర్నమెంట్ ముగింపు వేడుకలలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**అంకుశం న్యూస్ ధర్మవరం, జూన్ 16:** ధర్మవరం పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో ధర్మాంబా అసోసియేషన్ 75 వసంతాల వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 16వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.... క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, మంచి ఆరోగ్యం మరియు క్రమశిక్షణకు పునాది అని తెలిపారు. ముఖ్యంగా యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, జట్టు భావన, పోరాటస్ఫూర్తి పెరుగుతాయని అన్నారు. నేటి యువత ఆరోగ్యంగా, దృఢంగా ఎదగాలంటే క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు కీలక భూమిక పోషిస్తాయి అని మంత్రి పేర్కొన్నారు. ధర్మాంబా అసోసియేషన్ 75 సంవత్సరాలుగా క్రీడా సంస్కృతిని పరిరక్షిస్తూ హాకీ వంటి గొప్ప క్రీడను ప్రోత్సహించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఇలాంటి రాష్ట్రస్థాయి





పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో ధర్మవరం రాష్ట్రస్థాయి మాత్రమే కాకుండా జాతీయ స్థాయి క్రీడా కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ధర్మవరం ప్రాంతంలో క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరంలో త్వరలోనే ఆధునిక టర్ఫ్ హాకీ కోర్టు ఏర్పాటు చేస్తామని అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. టోర్నమెంట్ చివరి రోజు జరిగిన ఉత్కంఠభరిత పోటీలలో అనకాపల్లి మరియు అన్నమయ్య జిల్లాల జట్లు జాయింట్ విన్నర్స్‌గా నిలిచాయి. అనంతపురం జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. వ్యక్తిగత ప్రతిభకు సంబంధించిన అవార్డుల్లో అన్నమయ్య జిల్లాకు చెందిన హితేష్, సత్యసాయి జిల్లాకు చెందిన రఫీ, అనకాపల్లి జిల్లాకు చెందిన హర్ష కమల్ తమ అత్యుత్తమ ప్రదర్శనతో బెస్ట్ ప్లేయర్స్ ఆఫ్ ది టోర్నమెంట్ పురస్కారాలను అందుకున్నారు. విజేతలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మాంబా అసోసియేషన్ సభ్యులు,పల్లెం వేణుగోపాల్ తదితరులు మరియూ హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ చాణుక్యరాజు, హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, సత్యసాయి జిల్లావైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్, ఉడుముల రామచంద్ర, ట్రెజరర్ అంజన్న, జాయింట్ సెక్రెటరీ అరవింద్ గౌడ్, జెన్నే చంద్రశేఖర్, మారుతి, సభ్యులు అమునుద్దీన్ ,కిరణ్, ఫిజికల్ డైరెక్టర్లు రఘునాథరావు, ఓబులేసు,కోచ్ హసేన్ వివిధ జిల్లాల కార్యదర్శిలు, హాకీ క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# వ్యాపారస్తుల సమస్యలపై మంత్రిని కలిసిన అసోసియేషన్ సభ్యులు

**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 16:** ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి గౌరవనీయులైన సత్య కుమార్ యాదవ్ గారిని ది ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు తెలుగు రాష్ట్ర బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రీమతి జయ శ్రీ ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం ఎన్ డి ఏ ఆఫీసులో కలిసి కార్పొరేట్ రిటైల్ చైన్ల మరియు మార్వాడీల వ్యాపారం వల్ల స్థానిక చిన్నా మరియు మధ్య తరహా వ్యాపారస్తులు పడుతున్న ఇబ్బందులను మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది. అలాగే ధర్మవరం లాంటి చిన్నచిన్న పట్టణ ల లో నూతనంగా ఏర్పాటు చేయాలనుకుంటున్నా శరవణ స్టోర్స్ మరియు ఐ మార్ట్ వల్ల స్థానిక వ్యాపార సముదాయాలు పూర్తిగా దెబ్బతిని , నగదు బదిలీ జరగకుండా చిన్న చిన్న వ్యాపారస్తులు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని మంత్రిగారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగినది. కార్పొరేట్ రిటైల్ చైన్ ల వల్ల ప్రత్యక్షంగా



పరోక్షంగా అన్ని వర్గాల వ్యాపార సముదాయాలు పూర్తిగా దెబ్బతిని తద్వారా అనతి కాలం నుంచి వస్తున్న ధర్మవరం చేనేత వైభవం కూడా ప్రమాదంలో పడుతుందని సభ్యులు తెలియజేసినారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ మీ సమస్య త్రి వ్రత ను అర్థం చేసుకున్నాను , చిన్న మరియు మధ్య తరహా వ్యాపారవస్తుల పరిరక్షణ కోసం తొందరలోనే క్యాబినెట్ సమావేశంలో చర్చించి గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కిరాణా సంఘం ప్రెసిడెంట్ పిన్ను ప్రసాద్ , చంద్రశేఖర్ పవర్ లూమ్స్ ప్రెసిడెంట్ పోల వెంకటనారాయణ, వస్త్ర వ్యాపార సంఘం తరపున కోటి వెంకటేష్ , ధనుంజయ, శేషాద్రి రెడ్డి,సలీం భాష మురళి పూజా సామాగ్రి తరుపున గందోడి రాజా, స్వీట్స్ సంఘం తరఫున లడ్డు బాబు, ఆటోమొబైల్స్ తరఫున రమణ , గోల్డ్ సంగం తరఫున ఖలీల్ , కరెంట్ సామాన్ల సంఘం తరఫున విజయ్ ఎరువుల దుకాణాలు మరియు అనేక సంఘాల తరఫున భారీ ఎత్తున వ్యాపారస్తులు పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా ది ఆల్ ట్రైటాన్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మా సమస్యలు పరిష్కారానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటానని హామీ ఇచ్చిన మంత్రి సతీష్ కుమార్ గారికి మరియు రాష్ట్ర బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు అయిన శ్రీమతి జయ శ్రీ గారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేయడమైనది.


## అనాధ ఆశ్రమం లో చిన్నారి పుట్టినరోజు వేడుకలు

**అంకుశం. న్యూస్ ధర్మవరం జూన్ 16:** ధర్మవరం సుందరయ్య నగర్ కు చెందిన చిన్నారి గగన్ శ్రీత పుట్టినరోజు సందర్భంగా తల్లి తశీద్రులు శ్రీమతి సాయి లహరి సతీష్ కుటుంబ సభ్యులు యక్షిత్ తదితరులు పాల్గొని సోమవారం ధర్మవరం మండలం గొట్లూరు .అనాధ ఆశ్రమం లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ చిన్నారి పుట్టినరోజు అనాధ ఆశ్రమం లో జరుపుకోవడం ఎంతో సంతోషంగ ఉందన్నారు.



## కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు..

**అంకుశం న్యూస్అనంతపురం, జూన్ 16 :** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం లోనికళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భవతుల వార్డు, మహిళల వార్డు, ఆసుపత్రిని తనిఖీ చేసి, రోగులతో వైద్య సేవల గురించి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం వైద్యుల హాజరు పట్టిని పరిశీలించారు. ఇన్ టైం మాత్రమే ఎంటర్ చేసి ఉన్నట్లు గుర్తించి ఆసుపత్రి సిబ్బందిని హెచ్చరిక చేశారు. ఆసుపత్రిలో శుభ్రత బాగుందని, ఆక్సిజన్ ప్లాంట్ అవసరం ఉందని త్వరలో ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





## టీటీడీకి 10 లక్షలు విరాళం..

**అంకుశం న్యూస్ తిరుమల జూన్ 16:** ఒంగోలుకు చెందిన విజన్ ఆటోమొబైల్స్ సంస్థ అధినేత మంగళవారం టిటిడి వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ 10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి గారికి విరాళం డీడీని అందజేశారు..



## విద్యారంగానికి సేవ చేయండి

- ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్

**అంకుశం ప్రతినిధి విజయవాడ, జూన్ 16 :** విద్యారంగానికి లారీ ఓనర్ల ఫెడరేషన్ అందజేస్తున్న సహకారం ప్రశంసనీయమని ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. విద్యారంగ రంగానికి అందజేసే సహకారం భవిష్యత్తు తరాలకు





ఎంతో తోడ్పాటు అందిస్తుందని కొనియాడారు. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు అండగా నిలిచేందుకు లారీ ఓనర్ల ఫెడరేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, ఈ ఏడాది కూడా నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస కుమార్ ప్రతిపాదించిన శ్రీ విద్యాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ మరియు నెహ్రూ బొమ్మ సెంటర్ లోని భారతీ విద్యా నికేతన్ పాఠశాలలకు చెందిన 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆకుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఫెడరేషన్ సభ్యులు పర్వతనేని ప్రసాద రావు, గోపాల రావు, సుబ్రహ్మణ్యం, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యులు ఆకుల శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ హితం కోసం పాటుపడుతున్న ప్రసాద రావు, సాంబశివరావు లను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లం పూర్ణ, నూకల వాసు, ఆలమూరి సాంబ, సింగవరపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## 34 వార్డులో ఎలక్షన్ కమీషన్ స్పెషల్ రివిజన్ కార్యక్రమం

**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 16:** ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అన్న గారి ఆదేశాల మేరకు 34వ వార్డు రాజేంద్రనగర్ 253వ బూత్ లో కేంద్ర ఎలక్షన్ కమిషన్ పెట్టిన స్పెషల్ ఇన్విటెన్స్ రివిజన్ (SIR) కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు నాగూర్ ఉమర్ (స్టాలిన్) ,BLO మీనా గారు దీూూ మరియు బూత్ కన్వీనర్ బాబ్జాన్,కో కన్వీనర్ పోలా మోహన పాల్గొనడం జరిగింది.



## ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన కందికుంట వెంకటప్రసాద్

**అంకుశం, సత్యసాయి జిల్లా, జూన్: 16:** కూటమి ప్రభుత్వం 2 సంవత్సరాల "నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" పాలనపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి పుట్టపర్తి కి బయలుదేరి వెళుతున్న తనకల్లు మండలం చీకటిమాని పల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రయాణిస్తున్న ఇనోవా వాహనం అదుపుతప్పి కదిరి న్యూ బైపాస్ రోడ్డు నందు ప్రమాదానికి గురికావడం జరిగింది.ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు చేదాబాయి. వెంకటప్ప యోగేంద్ర, సిద్దగోళ్ల. శివన్న, పూజారి.కిష్టప్ప ,రాము 5మందికి గాయాలు అవ్వడంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి డ్యూటీ డాక్టర్లతో మాట్లాడుతూ మెరుగైన చికిత్స అందించాలని వారి కుటుంబ సభ్యులుకు దైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్న గారితో పాటు తనకల్లు మండలం కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీకగా పీర్ల చావడి ప్రారంభం



**రాప్తాడు అంకుశం న్యూస్ జూన్ 16:** మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో దశాబ్దాల కల సాకారమైంది. సుమారు 25 ఏళ్లుగా నిలిచిపోయిన పీర్ల పండుగను తిరిగి ప్రారంభించేందుకు వీలుగా, నూతనంగా నిర్మించిన పీర్ల చావడిని ఎమ్మెల్యే పరిటాల సునీత సోదరుడు టిడిపి మండల ఇన్చార్జి ధర్మవరపు మురళి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. శాశ్వత పీర్ల చావడి లేకపోవడంతో మొహర్రం పండుగను చేసుకోలేకపోయారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి పీర్ల చావడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే చొరవతో నిర్మాణం పూర్తి కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, ఓబులేసు, వాసురెడ్డి, గోవిందరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, తెలుగు యువత నాయకుడు రాజారెడ్డి, చిన్న ఓబులేసు, కాలవ శ్రీను, ముస్లిం సోదరులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పీర్ల చావడి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.